# అనాగతం

పడమటి కనుమల శిఖరాలు నిటారుగా నింగిని తాకుతున్నట్లున్నాయి. తెల్లని మబ్బులు తండోప తండాలుగా వచ్చి ఆపర్వత పంక్తుల్ని ఢీకొని విచ్ఛిన్న మౌతున్నాయి. దినకరుడు దీనంగా తన అరుణ వదనాన్ని పడమటి కనుమల మాటున మరుగు పరుస్తున్నాడు. వియద్ గంగాలహరిలా చంద్రముఖీ నది ఉరకలు వేస్తూ నురగలు క్రక్కుతూ ప్రేమోన్మాదంతో ప్రియుని చెంతకు చేరే ప్రేయసిలా పరవళ్ళు త్రొక్కుతోంది.

థియడోలైటును సరిచేసి మరొకమారు చూశాడు ప్రసాద్.

ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి ఆశ్చర్యపోయాడు. మోకాళ్ళ వరకూ వ్రేలాడుతున్న లంగా, బిగువైన జాకెట్టు, మెళ్లో రెండుమూడు పేటల రంగురంగుల పూసల పేర్లూ, గాలికి ఎగురుతూన్న పొడుగాటి వుంగరాల జుత్తు, ఎడమచేతిలో వున్న వడిసెను విలాసంగా గాలిలో త్రిప్పుతూ తనవేపు వస్తున్న కోయ యువతి కనిపించింది.

"చంద్రముఖీనది మానవరూపం ధరించిందా? తనపై పగబూని వస్తున్న 'నదీకన్య' కాదుకదా!?" అని ప్రసాద్ ఆశ్చర్యపోయాడు.

ఆమె దగ్గరవుతున్న కొలదీ ఆమె ముఖంలో చిరునవ్వు పోయి గాభరా కనిపించిందతనికి.

ఆమె గబగబా వచ్చి ప్రసాద్ చెయ్యి పట్టుకొని బలంగా ప్రక్కకు లాగింది.

ఆవూపు కాసుకోలేక యిద్దరూ నాలుగైదడుగుల దూరంలో పడ్డారు.

ప్రసాద్‌కు ఆమె మీద ఎక్కడా లేని కోపం వచ్చింది. చివాలున లేవబోయాడు.

ఆ యువతి అతడ్ని వారిస్తూ అటు చూడమని సౌంజ్ఞ చేసింది.

ముందు తను నిల్చున్న చోటుకు అడుగు దూరంలో కోడెత్రాచొకటి పడగవిప్పి నాట్యం చేస్తోంది.

ఏమరుపాటున తను ఒక అడుగు వెనక్కివేస్తే? ప్రసాద్ కంపించిపోయాడు.

త్రాచు కోపంలో పడగతో నేలనుగొట్టి ప్రక్క నున్న పొదల్లో అదృశ్యమైంది.

తన ప్రాణం కాపాడిన ఆయువతిని కృతజ్ఞతతో చూశాడు ప్రసాద్.

ఆమె అతడి చూపులకు తట్టుకోలేక సిగ్గుతో తలవంచుకుంది చెదరిన లంగాను సరిచేసుకొంటూ.

"నీపేరు.......?"

బుగ్గలు సొట్టలు పడేలా నవ్వింది.

"ఆమె తనపేరు చెప్పడానికి సిగ్గుపడుతూందా?!'

"మీ యిల్లు?"

కొండలోయల్లోకి చేతితో సౌంజ్ఞ చేసి చూపింది.

ప్రసాద్ క్షణకాలం వింతగా ఆమెవేపు చూసి సిగరెట్ తీసి వెలిగించాడు. లేచి నిల్చుని బట్టలు దులుపుకొని థియడోలైటు దగ్గరకు వెళ్ళాడు.

ఆ యువతి కూడా థియడో లైటు దగ్గరగా వెళ్లి, దాన్ని ముట్టుకొని అటూఇటూ వింతగా చూడసాగింది. ప్రసాద్ ఆమెను చేత్తో సౌంజ్ఞ చేస్తూ థియడో లైట్ గురించి చెప్పి చూడమన్నాడు.

ఆమె థియడోలైట్ లోంచి చూసి ఆశ్చర్యంగా నవ్వుతూ ప్రసాద్ ముఖంలోకి చూసింది.

ప్రసాద్ థియడో లైటును జాగ్రత్తగా తీసి కేసులో వుంచాడు. స్టేండును మడచి వాటిని జీపులో వుంచాడు.

ఆమెను కూడా ఎక్కమన్నాడు దారిలో దిగిపోవచ్చునని సౌంజ్ఞతో చెప్పాడు. ఆమె సంతోషంతో జీపెక్కి ప్రసాద్ ప్రక్కనే కూర్చుంది. ప్రసాద్ జీపు స్టార్ట్ చేశాడు జీపు ఎగుడు దిగుళ్ళ మీదుగా దారీడొంకా దాటుకుంటూ కొంతదూరం సాగిపోయింది.

ఆ కోయ యువతి వున్నట్టుండి ప్రసాద్ చెయ్యి పట్టుకుంది. ప్రసాద్ "ఏం" అన్నట్టు చూశాడు ఆమెవేపు. జీపు ఆపమని సౌంజ్ఞచేసింది. జీపుని ఆపాడు ప్రసాద్.

జీపు ఆగగానే ఆమె క్రిందకు దుమికి మెలికలు మెలికలుగా వున్న సన్నని కాలిబాటగుండా పరుగెత్తి అడవిలోకి అదృశ్యమైంది.

ప్రసాద్ ఆమె కనుమరుగయే వరకూ చూసి జీపు స్టార్ట్‌చేశాడు.

చంద్రముఖీ నదిమీద ఓ పెద్ద డామ్ నిర్మించడానికి కావల్సిన ఎస్టిమేట్సు, ప్లాన్లు తయారు చేయడానికి ప్రసాద్ నియమింపబడ్డాడు.

మర్నాడు "ఇంత ఉదయాన్నే వాచ్‌మేన్ ఎవరితో చెప్మా ఘర్షణపడుతున్నాడు!" అని కిటికీలోంచి చూశాడు ప్రసాద్.

అదే ఆ కోయ యువతి వాచ్‌మేన్ వారిస్తున్నా వినకుండా గేటు తీసుకొని లోపలకు వస్తోంది. వాచ్‌మెన్ గబగబా వచ్చి ఆమె చెయ్యి పట్టుకొని ఆపబోయాడు. ఆయువతి వాడిని చాచి లెంపకాయకొట్టి పరుగు పరుగున లోపలకు వచ్చింది. అంతా

ఒక్కక్షణంలో జరిగింది. ప్రసాద్ నిశ్చేష్టుడై నిల్చున్నాడు.

"సార్...... యిది జబర్దస్తీగా......" అంటూ గుమ్మం దగ్గర నిల్చొన్నాడు వాచ్‌మేన్.

".....ఫర్వాలేదు నువ్వెళ్ళు" అన్నాడు ప్రసాద్.

వాచ్‌మేన్ వెళ్ళిపోయాడు. ఆయువతి వాచ్‌మేన్ వెళ్ళినవేపు చురచురా చూసింది. కోపంలో కూడా ఆమె ముఖం చాలా అందంగా వుంది. బాలభానుని లేతకిరణాలు ఆమె ముంగురుల మీదా చెక్కిళ్ళమీదా పడి బంగారపు పూత పూస్తున్నాయి.

ప్రసాద్ ఆమె వేపొకమారు తీక్షణంగా చూసి సోఫాలో కూర్చున్నాడు.

ఆమెకూడా మెల్లగా అడుగులు వేసుకుంటూ వచ్చి ప్రసాద్‌కు ఎదురుగా నిల్చుంది.

'కూర్చో' అని సౌంజ్ఞ చేస్తూ కుర్చీ చూపించాడు.

ఆమె కూర్చోలేదు. అతనివేపు దీనంగా చూస్తూ నిల్చుంది. ప్రసాద్ ఆమెవేపు మళ్ళీ కోపంగా చూశాడు.

ఆమె కుర్చీలో కూర్చోకుండా నేలమీద అతని కాళ్ల దగ్గర కూర్చుంది. ప్రసాద్ కాళ్ళు దగ్గరగా లాక్కున్నాడు.

ఆయువతి ప్రసాద్ మోకాళ్ల మీద చేతులువేసి అతని వేపు దీనంగా క్షమించమన్నట్టు చూసింది.

ప్రసాద్ ఆమె కళ్ళల్లోకి నిశ్చలంగా చూశాడు.

ఆ కళ్ళకేదో భాష వుంది. ఆకళ్ళకి కాటుకలేదు. ఆ పెదవులకి లిప్‌స్టిక్ లేదు. ఆమె కేశాలకి సంస్కారం లేదు. ఆమె శరీరానికి అలంకారాల్లేవు. కాని ఏదో ఒక సందేశాన్ని, ఏదో ఒక వేదనని, ఏదో ఒక గాథ ఆమె చెప్పడానికి ఉద్యుక్తురాలై నట్లు చెప్పక చెప్తోంది ఆమె స్వరూపం.

గాయపడిన హృదయం కళ్ళ ద్వారా కన్నీటినీ, గొంతు ద్వారా దుఃఖ స్వరాన్ని వెలువరించి ఊరట చెందుతూంది. ఈ యువతికి మాటరానట్టుంది. ఇంకెలా?! ఇంకెలా తన దీనగాథల్ని ఇతర్లకి చెప్పుకుని హృదయంలోని భారాన్ని తగ్గించుకుంటుంది?

ప్రసాద్ ఆలోచిస్తూ ఆమె ముఖంలోకి చూస్తున్నాడు ఆమెను ఓదార్చాలనుకున్నాడు. ఎలా? ఆమెనెలా ఓదార్చడం? ఆమె కర్థమయ్యేభాష తనకిరాదు. రుమాలు తీసి ఆమె కన్నీటిని తుడిచాడు. ఆమె ముంగురులు సవరిస్తూంటే సిగ్గుతో తలవంచుకుందా కోయ పడుచు.

ప్రసాద్ వంటవాడిని కేకేసి కాఫీ, టిఫిను పట్రామన్నాడు. ఇద్దరూ టిఫినుతిని కాఫీ తాగారు.

ఆమె కాఫీ గ్లాసులూ, టిఫిను పళ్ళాలూ లోపలికి పట్టుకెళ్ళింది. ఇంతట్లో ప్రసాద్ కెమేరా తీశాడు. ఆమెవచ్చింది ఫోటోలు తీస్తాను నిలబడమని సౌంజ్ఞచేశాడు. ఆమె వద్దంది, ప్రసాద్ వినకుండా ఆమెను బలవంతం చేసి మూడు ఫోటోలు తీశాడు. ఆమె నవ్వుతూ నిల్చుంది.

"రేపు రా! నీబొమ్మలిస్తాను" అన్నాడు. ఆమె సంతోషంతో తలెగరేసి గేటు

తెరచుకొని బయటకు వెళ్లిపోయింది.

ప్రసాద్ ఆమె వెళ్ళినవేపు చూస్తూ పరధ్యానంగా నిల్చుండిపోయాడు. ఇంతట్లో వంటవాడి మాటలు వినిపించాయి.

"బాబూ! స్నానానికి నీళ్ళు సిద్ధంచేశాను" అంటూ.

ప్రసాద్ బాత్‌రూమ్‌వేపు నడిచాడు.

మర్నాడుదయం ప్రసాద్ డ్రాయింగ్ బోర్డుదగ్గర నిల్చుని ప్లాను గీస్తున్నాడు. మళ్ళీ వచ్చిందా కోయపిల్ల. మెల్లగా వచ్చి ప్రసాద్ ప్రక్కనే నిల్చుంది. ప్రసాద్ ఆమె రాకను గమనించనట్టే నటించి తన పనిలో నిమగ్నుడయ్యాడు. ఆమె కూడా చూస్తూ నిల్చుంది. కొంత సేపయాక ప్రసాద్ సిగరెట్టు తీసి నోట్లో పెట్టుకొని అగ్గిపెట్టెకోసం చూడబోయేసరికి ఆమె అగ్గిపుల్ల వెలిగించి సిగరెట్‌కు అంటించబోయింది.

ప్రసాద్ కొంచెం వెనక్కి వంగి ఆమె కళ్ళల్లోకి చూస్తూ నిల్చున్నాడు.

"ఆయ్!" అంటూ ఆమె చివరంటూ కాలిపోయిన అగ్గిపుల్లను దూరంగా విదిల్చి చురికిన వ్రేళ్ళను వూదుకుంటూ నిల్చుంది.

ప్రసాద్ ఆమెచేతిని తనచేతుల్లోకి తీసుకొని ఆ మృదువైన వేళ్ళను తన పెదవులమీద పెట్టుకున్నాడు. నెమ్మదిగా ఆమె తనచేతిని లాక్కుని కళ్ళకద్దుకుంది. ఆమెను తన హృదయానికి హత్తుకొని ఆమె పెదవుల్తో తన పెదవుల్ని కలపబోయాడు. ప్రసాద్ ఆశ్చర్యపోయాడు. ఆమె ముఖం భయంతో నిండిపోయింది. 'వద్ద'న్నట్టు చెయ్యివూపుతూ కౌగిలి విడిపించుకుని వెనక్కి వెళ్ళిపోయింది. అలా తిరిగి తిరిగి చూసుకుంటూ చెయ్యి వూపుతూ పరుగెత్తుకుంటూ వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిన కొద్దిక్షణాలకు ప్రసాద్ తేరుకున్నాడు. ఎంతనీచంగా ప్రవర్తించాడు తను తన చదువూ సంస్కారం ఏమైనట్టు. ఆ యువతి తనను క్షమిస్తుందా?' ప్రసాద్ తనను తానే నిందించుకున్నాడు.

మూడు రోజులైంది కాని ఆమె మళ్ళీ రాలేదు.

ఆమె రాకపోతే ప్రసాద్‌కి ఏపనిచెయ్యడానికీ ఉత్సాహంగా వుండడంలేదు. మూడు రోజుల స్నేహంలోనే ఆమె ప్రసాద్‌కు ఎంతో సన్నిహితురాలైంది.

ఆమె మృదుస్పర్శ కోసం అతని దేహం, ఆమె సుందరరూపాన్ని తిలకించడం కోసం అతని కనుదోయీ ఎల్లవేళలా తహతహలాడి పోయాయి.

ప్రసాద్ ఓరోజు కెమేరాతీసి ఫిల్ముని కడిగి డెవలప్‌చేశాడు. మూడు స్పేసులు తెల్లగా వున్నాయి. ఆ కోయ యువతి బొమ్మ పడలేదు. చంద్రముఖీనది పడమటి కనుమలు, పెద్దమర్రిచెట్టు, పాడైపోయిన ఆలయంపైన శిల్పం, సూర్యకాంతం పువ్వులూ, అన్నీ వున్నాయి. కాని ఆయువతి ఫొటోలు పడలేదు. కెమేరా తీశాడు. షటర్ ఓపెన్‌చేసి స్పేపు సమానంగా వుందోలేదో చూశాడు. కెమేరాలో అన్ని భాగాలూ సక్రమంగానే వున్నాయి. ఆమె ఫొటోలు పడకపోవటానికి కారణమేమిటో ప్రసాద్ ఊహించ లేకపోయాడు.

సాయంత్రం చేత్తో హంటర్ పట్టుకొని షికారు బయలుదేరాడు. చంద్రముఖీనది

ఒడ్డుమీంచి నడుస్తున్నాడు. గంభీరంగా కదలిపోతూంది చంద్రముఖీనది. ఈ నదికి ఈవల ఆవలా ఎన్నో వూళ్ళు ఎంతో మంది మనుషులూ వున్నారు. ఎన్నో గాథలు నడిచాయి. ఎంతో చరిత్ర సాగిపోయింది. కాని ఈనది ఇలానే సజీవంగా ప్రవహిస్తోంది.

ఎదురుగా కోయపిల్ల కనబడగానే ప్రసాద్ నిలబడిపోయాడు. అతనిహృదయం ఆనందంతో పొంగిపోయింది. ఒకక్షణం తర్వాత ఆమె చిరునవ్వు నవ్వుతూ ప్రసాదు చెయ్యి పట్టుకొని తన వెంట రమ్మన్నట్టు లాగింది. ఇద్దరూ బయల్దేరారు.

కొంతదూరం వెళ్లేసరికి బాజాలు వినబడ్డాయి. ప్రసాద్ ఆకోయపిల్లా ఓ కోయగూడెం చేరుకున్నారు. అక్కడంతా రంగురంగుల దుస్తులు వేసుకొని ఆడా, మగా బారులు తీర్చి నిలబడ్డారు, చివర ఓ ఎత్తైన మంచె మీద ఓ ముసలి కోయదొర, అతడి భార్యా కూర్చున్నారు.

ప్రసాద్యూ, కోయపిల్లా అక్కడికి చేరగానే బాజాలు వాయిస్తున్నవాళ్ళు ఆపేశారు. అంతటా నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వెక్కి వెక్కి ఏడ్చేనశబ్దం ప్రసాద్ చెవుల్లోపడింది. అతనిగుండె కలుక్కుమంది. బహుశా ఇది వీళ్ళ సాంప్రదాయం ప్రకారం వివాహమహోత్సవం అనుకున్నాడు, ముసలి కోయవేపు చూశాడు. ఆవృద్ధ దంపతులిద్దరూ చేతులలో ముఖాలు దాచుకుని వెక్కివెక్కి ఏడుస్తున్నారు.

ప్రసాదు ఆకోయ యువతివేపు చూశాడు. ఆమెప్రసాద్ చెయ్యివదలి చప్పట్లు చరిచింది. ఆ లయప్రకారం మళ్ళీ బాజాలు వాయించడం ప్రారంభించారు వాయిద్యగాళ్ళు.

ఆమె వారిమధ్య నిలబడి వివిధ రీతుల్లో నాట్యం చేసింది. ఆ నాట్యం కూడా విషాదంగా వుంది ఆబాజాలు కూడా మంద్రస్థాయిలో నెమ్మదిగా విషాదంగా మోగాయి. ఆమె అలా నాట్యంచేస్తుచేస్తూ ప్రసాద్‌వేపు చూసి చిరునవ్వు నవ్వుతూ అలాగుడిసె వెనక్కి వెళ్ళింది.

ప్రసాద్‌కూడా ఆవైపు పరిగెట్టాడు. ఆచిన్న పల్లె అంతా వెతికాడు. కనపళ్ళేదు, ప్రతీగుడిసె గాలించాడు. కనపడలేదు. అతనికి పిచ్చెత్తినట్టయింది. ఆ ముసలివాళ్ళు కూర్చున్న మంచెదగ్గరకు వెళ్ళాడు.

'ఆ అమ్మాయేది?' అని గట్టిగా అరిచాడు.

ఆ ముసలి కోయదొర బాజాలు ఆపమని సొంజ్ఞ చేసి మధ్యమధ్య దుఃఖిస్తూ చెప్పడం మొదలు పెట్టాడు.

"పేది జాతరల ఎనకటిమాటదొరా! ఆ జాతరనాడు తొలికోడి కూతకి నెగసి నాకూన తానమాడి కొత్తగుడ్డలు కట్టింది, మలికోడికూతకి కన్నెబొట్టెలకి పరుగు పందెం పెట్టి నెగ్గినదాని పేరు మీద జాతర జరుపుతాం. నాకూన సిటెకెలో యాటకాడేసిన బానంలా. తుపాకీ ఒగ్గినగుండులా దూసుకుపోయి కొండదేవర పాదాలకాడ వాలిపోయింది. మరినెగనేదు..... దొరా నాకూన కొండ దేవరకి....." అంటూ గొల్లుమన్నాడు.

ప్రజామత వీక్లీ 1.9.1963.